క్లుప్తంగా

నేడు ఉచిత పశువైద్య శిబిరం

పాన్‌గల్: జాతీయ సేవా పథకం ద్వారా పీవీ నర్సింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ కళాశాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి డా.శ్యామ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పశువైద్య శిబిరంలో ఎదకు రాని పశువులు, చూడి పశువుల నిర్ధారణ, వివిధ సమస్యలను అనుభవం గల ప్రొఫెసర్లు పరీక్షిస్తారన్నారు. ఈ శిబిరాన్ని పాన్‌గల్, బహదూర్‌గూడెం, బండపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి, అన్నారం గ్రామ రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



పాన్‌గల్: బడి ఈడు కలిగిన పిల్లలతో పనులు చేయించకుండా పాఠశాలలో చేర్పాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో బడిఈడు పిల్లల గుర్తింపుపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బడి బయట ఉన్న సంతోష్, తరుణ్, పౌర్ణమి అనే ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యత, చదువుకుంటే కలిగే లాభాలు, బడిఈడు పిల్లలచే పనులు చేయిస్తే ఉన్న చర్యలను వారి తల్లిదండ్రులకు వివరించి ముగ్గురు విద్యార్థులను స్థానిక పాఠశాలల్లో చేర్పించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ గోవింద్ నాయక్, రమాదేవి, భార్గవి, ఐఈఆర్పీ నరేంద్ర, హెచ్‌ఎం బీచ్యానాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాటల పోటీలు



ఆత్మకూర్: జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటుహక్కు ప్రాముఖ్యత గురించి బుధవారం పాటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డీఎస్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ ఓటు హక్కు ఆయుధంలా పనిచేస్తుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఓటు ఎంత విలువైందో తల్లి తండ్రులకు, గ్రామస్తులకు వివరించాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు టీజే విశ్వేశ్వర్, భాగ్యవర్ధన్‌రెడ్డి, సునీల్‌కుమార్, కురుమూర్తి, శ్వేత, పావని పాల్గొన్నారు.

మట్టి, ఇసుక అక్రమ తరలింపు



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): అధికారుల నిఘా లోపంతో మండలంలో మట్టి వ్యాపారులు రెచ్చిపోతున్నారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ ప్రకృతి సంపదను రాత్రింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్లతో దోచుకుంటున్నారు. అక్రమంగా మట్టి, ఇసుకను తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. మండలంలోని వెల్టూర్ సమీపంలో గల గోపాలసముద్రం నుంచి మట్టి, ఇసుక, మోజర్ల సమీపంలో గల గుట్ట నుంచి మట్టిని రాత్రి వేళల్లో టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం లేదని అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ దందా మొత్తం అధికారుల కనుసైగలోనే జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రకృతి సంపదను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వనపర్తి టౌన్: టీయూటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీని బుధవారం కలెక్టరేట్ సమీకృత కార్యాలయంలోని డీఈఓ ఆఫీస్‌లో డీఈఓ రవీందర్ ఆవిష్కరించారు. విద్యార్థులకు ఉత్తమ బోధన చేసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాల చెన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓటుతోనే మార్పునకు నాంది



ఆత్మకూర్‌లో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజలు

వనపర్తి టౌన్: కొత్త ఓటరుకు ఓటుపై అవగాహన ఉంటేనే సరైన నాయకులను ఎన్నుకోగలరని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి నుషిత అన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కరెమ్మ గుడి ఎదుట 18ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ సీడీఓ మల్లేశం, హెచ్‌డబ్ల్యూజీసీ రాజు, శరవంద, స్టార్ రహీం, అంజనేయులు, నాగరాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్స్ కళాశాలలో..

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటు హక్కు నమోదులో నిర్లక్ష్యంగా ఉండటం సమాజానికి శ్రేయస్కరం కాదని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఓటర్ నమోదుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ జగదీశ్వర్, ప్రిన్సిపాల్ శ్రీధర్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఓటరు నమోదుపై బుధవారం మండల వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులచే తహసీల్దార్ ఏసయ్య ప్రతిజ్ఞ చేయించారు. దీంతో పాటు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీటీ చక్రపాణి, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని తహసీల్దార్ సంధ్య, వివిధ పార్టీలకు చెందిన నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అఫ్జల్, మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాలీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్ ఉన్నారు.

ఆత్మకూర్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆత్మకూర్‌లోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, ఎంపీపీ ఆవుల శైలజ, కమిషనర్ జాన్ కృపాకర్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, డీటీ జయసింహ పాల్గొన్నారు.



పెబ్బేరులో..



అమరచింతలో..

అమరచింత: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, తహసీల్దార్ చాంద్‌పాషా, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రజలు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భాను ప్రకాష్, సీనియర్ ఓటరు బెస్త బాలయ్యను సర్పంచ్ వెంకటరమణతో కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాధ పాల్గొన్నారు.



పెద్దమందడిలో..



పాన్‌గల్‌లో..



వనపర్తిలో..



ఖిల్లాఘనపురంలో..

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి



వనపర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధులో రాజకీయ జోక్యం లేకుండా జిల్లా పాలన అధికారుల పర్యవేక్షణలో గ్రామ సభల ద్వారా అర్హులైన దళితులకు దళితబంధు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితబంధు బడ్జెట్ రూ.17,700 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. దళిత బంధు హామీ ఎన్నికల ప్రచారానికి మాత్రమే అన్న అపోహ దళితుల్లో రాకముందే హైకోర్టు సూచన మేరకు దళితబంధు పథకంలో రాజకీయ జోక్యం లేకుండా లబ్ధిదారులను గుర్తించి నిధులు విడుదల చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ కమిటీ సభ్యుడు వెంకట్రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు గంధం గట్టన్న, సహాయ కార్యదర్శి రాజేష్, జిల్లా నాయకులు చంద్రశేఖర్, మల్లేష్, నరసింహ, నారాయణ, రాజు, వెంకటేష్, శాంతన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయింపు



స్థలం పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: పట్టణంలోని డంపింగ్ యార్డును తరలించి మస్తీపురం శివారులో ఏర్పాటు చేయడానికి రెండు ఎకరాల 11 గుంటల స్థలాన్ని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కేటాయించామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. ప్రస్తుతం పట్టణంలోని సబ్‌స్టేషన్ ఎదురుగా డంపింగ్ యార్డు ఉండడంతో రహదారిపై వెళ్తున్న వారితో పాటు పక్కనే ఉన్న చేనేత ఉత్పత్తుల సంఘం కార్మికులు ఇబ్బందులు పడుతుండడంతో డంపింగ్ యార్డును మార్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. మస్తీపురం శివారులోని సర్వేనంబర్ 610లో రెండు ఎకరాల 11 గుంటల స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా గుర్తించడంతో కలెక్టర్ యాస్మిన్‌బాషా వాటిని మున్సిపాలిటీకి కేటాయించారని పేర్కొన్నా. డంపింగ్ యార్డుతో పాటు మల బురద శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే పట్టణంలో సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమిపూజ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర సాధించే వరకు పోరాటం



మాట్లాడుతున్న వెంకటేష్

అమరచింత: రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలంటూ జిల్లా కేంద్రాల్లో ఈనెల 26న ట్రాక్టర్ ర్యాలీని నిర్వహించేందుకు ఏఐకేఎస్ సిద్ధంగా ఉందని ఆ సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన ఏఐకేఎస్ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్ ర్యాలీలను నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు నష్టం వచ్చే పద్ధతిలో మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చి రైతులకు వెన్నుపోటు పొడిచే విధంగా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకొచ్చిందని మండిపడ్డారు. ఏడాది పాటు నిర్వహించిన ఉద్యమంలో 740 మంది రైతులు చనిపోవడం బాధాకరమన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫారసుల ప్రకారం ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి రైతులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శివ రమేష్, ఆశోక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన



పెబ్బేరు: మండలంలోని రాంపూర్ శివారులో వరి పంటలను బుధవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రమౌళి మాట్లాడుతూ వరి పంటలకు కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువ ఉందని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నివారణ ఎకరాకు 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్, జింకు లోప నివారణ ఎకరాకు 250 గ్రాముల చిలమీన్ జింకు స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అంజనేయులు,కర్రెన్న, ఆడెం పుల్లన్న పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకులపై దాడులు సరికాదు

పాన్‌గల్: మహబూబ్‌నగర్ పట్టణంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకుల మీద బీజేపీ నాయకుల దాడిని నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా ఇంచార్జ్ గంధం లక్ష్మయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ఆ దిశ అడుగులు వేయట్లేదని దుయ్యబట్టారు. వర్గీకరణకు చేపట్టాలని నిరసన చేస్తే బీజేపీ నాయకులు దాడులు చేయడం సరికాదన్నారు. పార్లమెంట్ శీతాకాల బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టకపోతే తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ నాయకులను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సన్నయ్య, శ్రీరాములు, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

మదనాపురం: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొన్నూర్ గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ మైనారిటీ కార్యదర్శి అంజాద్ అలీ, ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి మహేష్, దేవరకద్ర నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు అక్కి రాఘవేంద్రగౌడ్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య, మండల గౌరవ అధ్యక్షుడు సత్యశీలారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వడ్డె కృష్ణ, ఓబీసీ మండల అధ్యక్షుడు ఆవుల రాఘవేంద్ర, కావలి అశోక్ కుమార్, తోకలి రవి, నాయకులు గుగ్గిళ్ల రాములు, అతిక్, గంగాధర్, సిట్యాళ్ల కొండన్న, అరుణ్, నాయిని రాము, ఆంజనేయులు, విజయ్, శివ, ఓంప్రకాష్, నసీర్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మానవహారం చేస్తున్న విద్యార్థులు

వనపర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను మార్చుకొని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ మెన్స్ కోఎడ్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న రూ.2,200 కోట్ల స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల నిర్లక్ష్యాన్ని వీడాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్‌పై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇష్టానుసారంగా పెంచిన ఫీజులను తగ్గించి ప్రభుత్వమే పూర్తి ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బాలకృష్ణ, అంబేద్కర్, జోనల్ ఇన్‌చార్జ్ కేదారనాథ్, నాయకులు శివ, వంశీ పాల్గొన్నారు.

నేటి నుంచి అబ్దుల్ రహీం ఉర్సు

మదనాపురం: కులమతాలకతీతంగా నిర్వహించే అబ్దుల్ రహీం ఆరాధన ఉర్సు మండలంలోని దుప్పల్లిలో గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే ఈ ఉత్సవాలకు తెలంగాణతో పాటు కర్ణాటక, ఒరిస్సా, మహరాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై మొక్కులను చెల్లించుకుంటారు. గులాబీ పూల గుమగుమలతో దర్గాను సుందరంగా అలంకరిస్తారు. 26న దర్గా నుంచి గంధాన్ని భక్తులు తలపై పెట్టుకొని భాజభజంత్రీ ఉరేగింపుగా తీసుకెళ్లి మమాబూబ్‌సుభాని దర్గాకు సమర్పిస్తారు. 27న దర్గాను దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. 28న దివ్యఖురాన్ పఠణం కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి.

పీఠాధిపతుల రాక..

తాండూర్ సయ్యద్ అబ్దుల్ కరీం దర్గా పీఠాధిపతులు సయ్యద్ సాబేర్ పాష, అజీష్ పాష ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. మూడు రోజుల పాటు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా విడిది సత్రాలు, అన్నదానం, తాగునీటి వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు సుకుమార్‌గౌడ్, దర్గా నిర్వాహకులు తెలిపారు.



ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



అన్నారంతండాలో కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అమరచింత: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు ద్వారా 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలను నిర్వహిస్తున్నామని డీఐఓ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మస్తీపురంలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈమేరకు వైద్యాధికారి డాక్టర్ దీపికతో కంటి పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మస్తీపురంలో మొదటి రోజు 210 మందికి పరీక్షలు నిర్వహించగా 47 మందికి కంటి అద్దాలు ఇవ్వడంతో పాటు శస్త్ర పరీక్షలకు 67 గుర్తించినట్లు డాక్టర్ దీపిక తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, రైతు సమితి మండల అధ్యక్షుడు చుక్క ఆశిరెడ్డి, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరసింహులు, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, గోపాల్ ఉన్నారు.

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమంతో అంధత్వ సమస్యలు తీరనున్నాయని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ రమేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవి యాదవ్ అన్నారు. బుధవారం ఆత్మకూర్ మున్సిపాలిటీలోని జాతర మైదానంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు రంజిత్‌రెడ్డి, శివలీల, దీపిక, నిఖిత, హెల్త్‌సూపర్‌వైజర్లు సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

పాన్‌గల్: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల సిబ్బంది ప్రజలను చైతన్యం చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అన్నారం తండాలో కంటి వెలుగు శిబిరా న్ని ఆయన అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, మాజీ సర్పంచ్ ఠాకూర్‌నాయక్, అప్తాలమిస్టు తౌకీర్, పంచాయతీ కార్యదర్శి బొజ్యానాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

622 మందికి..

మండలంలోని అన్నారంతండా, మాందాపూర్, మల్లాయిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాల్లో బుధవారం 622 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. పరీక్షలు నిర్వహించిన వారిలో 39 మందికి కంటి అద్దాలు, 14 మందికి కంటి ఆపరేషన్‌కు సిఫార్సు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

460 మందికి కంటి పరీక్షలు

ఖిల్లాఘనపురం: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం మొత్తం 460 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సౌజన్యలత తెలిపారు. ఖిల్లాఘనపురం పీహెచ్‌సీ పరిధిలోని సోళీపురంలో 239 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 36 మందికి అద్దాలు పంపిణీ చేశారు. అదేవిధంగా ఆరుగురికి ఆపరేషన్ అవసరమని గుర్తించామన్నారు. కమాలొద్దీన్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలోని వెనికితండాలో మొత్తం 221 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా నలుగురికి కంటి అద్దాలు అందించడంతో పాటు ఒక్కరికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో డాక్టర్ రాంచందర్ రెడ్డి, మక్బుల్ పాష తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని విడుదల చేయండి

పెంట్లవెల్లి: జూరాల చివరి ఆయకట్టుకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ హనుమంతుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఈశ్వర్ మాట్లాడుతూ జూరాల చివరి ఆయకట్టు డి–36 కాల్వకు నీళ్ల లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలపారు. పెంట్లవెల్లి మండలంలోని జటప్రోల్, గోపులాపురం, సింగవరం, కొండూరు గ్రామాల రైతులకు నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వెంటనే జూరాల నుంచి సాగునీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.